# జాలి



**పవని నిర్మల ప్రభావతి**

వంటగది అనబడే ఆ చిన్న ఇరుకు గదిలో నీలిరంగు మంట విరజిమ్ముతున్న కిర్సనాయిలు స్టౌ ముందు కూర్చుని వుంది ఆమె స్టౌమీద ఎసరు పడేసింది గిన్నెతో. హాలు, బెడ్‌రూం, గెస్ట్‌రూం ... అన్నీ ఒకటే అయిన ముందుగదిలో ఈజీచైర్‌లో అతగాడు కూర్చుని వున్నాడు. బాగా పెరిగిన గడ్డం .... మాసిన బట్టలు .... చీకట్లో చూస్తే ఎదుటివారు ఝడుసుకొనేలా వున్నాడు. రాత్రి ఎనిమిదిన్నర కావస్తోంది. రెండు గదులకీ మధ్య గోడ, ద్వారంవుంది. ఆమె కతగాడుకనిపించడు. గోడవారగా ఈజీచైర్ వుందికాబట్టి. కానీ అతగాడి కామె స్పష్టంగా కనిపిస్తోంది. వంటఇంట్లో లైటువెలుగుతోంది. స్టౌముందు పీటమీద ఆమె కూర్చుని వుంది తదేకంగా నీలిమంటవేపు చూస్తూ

ఆకుపచ్చ సన్నని జరీ నేతచీర, ఆకుపచ్చ జాకెట్టు, వీపుమీదకు జారిన నిమ్మకాయంత జుట్టుముడి.... ఆ జుట్టు కూడా చాలాభాగం నెరసిపోయి ....

"యశోద.... ఈమేనా ?" అనుకున్నాడతగాడు.... ఎందుకో జాలి పొంగుకు వచ్చింది.

"యశోదా ?" మృదువుగా పిలిచాడు ఒంగి.

ఆమె తల తిప్పలేదు .... ఒకే ఒక లక్ష్యం మీద పంచేంద్రియాలూ కేంద్రీకరించిన యోగినిలా.... నీలిమంటకేసి చూస్తూనే వుంది.

"యశోదా ?" మళ్ళీ పిలిచాడు.

"ఊఁ!" అలాగే "వూఁ!" అంది విధిలేనట్లు.

"బాబు ఎప్పుడొస్తాడన్నావు ?"

"చెప్పానుగా ? ఈరోజు వాడు ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. వాడి ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్ళాడు. బహుశా రాత్రి పదిదాటాక రావొచ్చు."

ఓ క్షణం నిశ్శబ్దంగా వున్నాడతగాడు.... ఉత్సాహంగా అన్నాడు.

"ఇదీ ఒకందుకు మంచిదే. ఇంకా గంటన్నర టైముంది. మనం ఎన్నో విషయాలు మాట్లాడుకోవచ్చు. ఇద్దరం భోంచేద్దాం ;"

ఆమె "ఊఁ!" అనలేదు. పక్కనే వున్న స్టీలుగిన్నెలో కడిగి వుంచుకున్న బియ్యం మరుగుతున్న ఎసరులోవేసింది.

"నామీద ఇంకా కోపం పోలేదు కదూ ? క్షమించమన్నానుగా ? నాకు తెలుసు నువ్వు క్షమిస్తావు. నీలో యుగయుగాల భారతనారీ రక్తంవుంది. అది నిన్ను కఠినంగా మార్చదు.... జాలి ప్రేరేపిస్తుంది. అందాకా ఆగుతాను. ." ఉత్సాహంగా అన్నాడతగాడు.

ఆమె ఇప్పుడూ పలకలేదు.

అతగాడు కాస్త నిరుత్సాహంగా అన్నాడు.

"ఆలోచించు.... బాగా ఆలోచించు... బాబు వచ్చాక వాడితోకూడా ఆలోచించు...."

"వాడు నా కొడుకు!" బాణంలా వచ్చిందామెనుంచి సమాధానం.


"నా కొడుకుకూడా!" అతగాడు పకపక నవ్వాడు....

ఆమె త్రుళ్ళిపడింది..ఆ నవ్వు....పాతికేళ్ళక్రితం..ఇదే నవ్వు..ఈ కొంటె నవ్వు..తనలో పులకింతలు రేపింది! ఆ నవ్వుతున్న పెదవుల్ని, నవ్వేటప్పుడు చికిలించుకుపోయే కళ్ళనీ....పదేపదే పెదవులతో స్పృశించిందానాడు. కానీ ఈనాడు....ఆ నవ్వు....దిగంతాల కవతలనుంచీ.. తనమీద విరుకుచుపడుతున్న భయంకరమైన పిడుగుపాటు ధ్వనిలా...తననీ తన ఈ పాతిక సంవత్సరాల జీవితాన్ని వెక్కిరిస్తున్న వేలాది గొంతుకల్లోని హేళనలా....

"కావొచ్చు ... కానీ వాడి ఇరవైమూడేళ్ళ జీవితమూ..ఏ వ్యక్తి ఇంత గర్వంగా 'నా కొడుకు!' అని చెప్పకుండానే గడిచిపోయాయి..అది మీరు గుర్తించికోవాలి!" కఠినంగా అంది. ఆ నవ్వు తరంగాల్ని హృదయంలో చొరనివ్వకుండా అతిప్రయత్నం మీద అరికడుతోంది.

"సారీ! పదిమార్లు క్షమించమంటున్నాను..మర్చిపో! గతం మర్చిపో....క్షమాభిక్ష పెట్టు .జాలిచూపు .. ఇకనేనాట్టే మాట్లాడను..నేను అతిగా మాట్లాడితే నీకు మనసుకు కష్టంకలిగేలా వుంది!" అతగాడు నీరసంగా ఈజీఛైర్ లోవెనక్కివాలాడు.

జాలి! క్షమాభిక్ష....అన్నం వార్చి..పప్పుపడేసింది చిన్నగిన్నెతో .... ఆ మాటలకు పాతికేళ్ళ తర్వాత అర్థం వెతుక్కోవలసిన విచిత్ర పరిస్థిలోవుంది తనీనాడు! కానీ ఆనాడు..ఆ కాళరాత్రి...ఇలాగే అమావాస్య ముందు రోజులు...దీపావళి రెండురోజులుంది. కార్తీక మాసం..వర్షాలుకూడా .. చీకటిని మరింత ఉధృతం చేస్తున్నాయి..ఆమె ఆలోచనలు



గతంవేపు దూసుకుపోతున్నాయి. రాకెట్టులా!

* * *

గోపాలరావుకి, పెళ్ళి కావలసిన ఇద్దరు చెల్లాయి లున్నారు. చదువుకుంటున్న ఓ తమ్ముడున్నాడు. రెండేళ్ళలో రిటైర్ కాబోతున్నానన్న దిగులుతో .. ఇప్పుడే "హై బ్లడ్ ప్రెషర్" తెచ్చుకుని, రోజు మార్చి రోజు తలతిరిగి పడిపోతున్న తండ్రి వెంకట్రామయ్యగారున్నారు. నీరసంతో చాకిరీ చేసుకోలేక పిల్లల్ని విసుక్కునే తల్లి కామాక్షమ్మ వుంది. ఆ ఇరుకు ఇంట్లో వీళ్ళెక్కడ సుఖపడిపోతారోనని..ఆయుష్షు అదనంగా అడిగి తెచ్చుకున్న బామ్మ కనకమ్మ ఉబ్బసంతో మంచంలోవుంది! ఇంతమంది వుండగా.. గోపాలరావుకి పెళ్ళికేంతొందరొచ్చిందో ఎవరికీ తెలీదు,

"అమ్మాయికి డిగ్రీవుంది. ఉద్యోగం వుంది చాలు. కట్నం తీసుకున్నామన్న పేరుకంటే! తీసుకోలేదన్న గౌరవమూ వుంటుంది.. బంగారు గుడ్లుపెట్టేబాతులా కోడలు కుటుంబాన్ని ఆదుకుంటుంది!" అన్నారు వెంకట్రామయ్యగారు..పిల్లని చూచివచ్చి, భార్య కామాక్షమ్మతో.

"ఆడపిల్లలకి పెళ్ళి," కామాక్షమ్మ ఆదుర్దాగా అడిగింది.

"నీ తెలివితక్కువతనం బయటపెట్టుకోకు! కోడలి సంపాదన ఎవరికోసం? లోన్ తెస్తాను వాళ్ళిద్దరి పెళ్ళిళ్ళకి..నెలనెలా కోడలిజీతం జమవేద్దాం! అబ్బాయి గోపాలానికీ, నాకూ వచ్చే సంపాదన ఇంటిఖర్చులకి చాలు....!"

ఆమె పలకలేదు.

గోపాలరావుకి యశోదను చూశాక మతిపోయింది! ఆ చిక్కటి పెద్దకళ్ళు . ఏ నవరాలూ లేకుండానే, పిరుదులకిందికి వున్న పెద్ద జడ..అందం రాశిపోసినట్లున్న పర్సనాలిటీ..డిగ్రీ!ఉద్యోగం.." మీ ఇష్టం నాన్నా! మీ అందరికీనచ్చితే, నాకు నచ్చినట్టే...." అన్నాడు గంభీరంగా! నెలతిరిగేసరికి యశోద..కొత్త కోడలుగా ఆ ఇంట్లో అడుగెట్టింది.

వంటగది..ముందుహాలు..ఆ ముందు పెంకుటివరండా. వరండాలో ఓ వేపుగా వున్న గదిలో ముసలమ్మ..మొదట్లో గోపాలరావు, యశోదలకు బెడ్ రూంగా వంటగది కేటాయించారు. కానీ, ఏవేళప్పుడంటే ఆవేళప్పుడు బాత్ రూంకు ఎవరు వెళ్ళాలన్నా! వంటగదిలోంచే వెళ్ళాలి! తెల్లవార్లూ, తలుపులు తియ్యటమూ, వెయ్యటమే సరిపోయింది. ముసలమ్మను ఎట్టి పరిస్థితిలోనూ వంటగదిలో పడుకోబెట్ట వీల్లేదు. అంచేత

ముసలమ్మ వున్న వాకిటిగదిలో — మధ్యగా ఓ కర్టెన్ కట్టి, అటువేపు యశోద, గోపాలరావూ.. ఇటువేపు ముసలమ్మ మంచం వుంచే ఏర్పాటు చేయబడింది..తను అరచిచచ్చినా, పలికే వాళ్లెవరూ లేరనుకున్నప్పుడు ముసలమ్మ హాయిగా నిద్రపోయింది. ఇన్నేళ్ళూ. తనకి కూతవేటు దూరంలో..ఓ పడుచు జంట వున్నారని రూఢీ అయ్యాక ముసలమ్మ బాధలు, మూలుగులూ, దగ్గులూ “నాయనా! నన్నిటునుంచి అటు పొర్లించండిరా..ఈ కిటికీ ముయ్యండిరా! ఏమిటా గుసగుసలు? ఇంకా నిద్రపోలే? చెవిలో మాటలు వినిపిస్తుంటే నాకు నిద్రపట్టదురోయ్! దగ్గు, ఆయాసం ముందుకు వస్తున్నాయి. ఈ దుప్పటి కప్పి, ఆ ఫాన్ తీసెయ్యండే తల్లీ!” లాటి కేకలూ ఎక్కువయ్యాయి.

“ఛ....ఛ....నరకం అంటే ఎక్కడో లేదు యశోదా! మన మధ్యతరగతి కుటుంబాలలోనే తిష్ఠవేసుకుంది. మనిషికోరకం సైకాలజీ! ఛస్తున్నాం!” రెండునెలలు విసిగిపోయి. విసుక్కున్నాడు గోపాలరావు.

యశోద నవ్వింది. తిష్ఠవేసుకూర్చున్న నరకాన్ని మనమే తరిమెయ్యవచ్చు. కాస్త ప్రయత్నిస్తే....!”

“ఎలా?”

“మరి కాస్త పెద్దఇల్లు తీసుకుందాం. ఇంట్లో ముగ్గురం సంపాయిస్తున్నాం. ఏడుగురం పెద్దలమున్నాం. మరో రెండు గదులు ఎక్స్ట్రాగావుండే ఇల్లు. మరో వంద బాడుగ పోతేపోయింది. పగలంతా ఆఫీసుల్లో శ్రమపడినా రాత్రి మంచి నిద్ర, ప్రశాంతత వుంటుంది. ఏమంటారు?”

గోపాలరావుకు యశోద ఆలోచన చాలా చాలా నచ్చింది. అమలు చేసి వుంటే సరిపోయేది. కానీ అతగాడి మాతృభక్తి, పితృభక్తి, తను శ్రీరామచంద్రుడికీ, సత్యహరిచంద్రుడికీ, గౌతమబుద్ధుడికీ, ఇంకా చాలా చాలా మంది మహనీయులకీ వారసుణ్ణన్న సంగతి—ఆ పని చేసేముందు, తల్లి తండ్రిని సంప్రదించమన్నాయి.

“కోడలుపిల్లకి వేరు కాపురం పెట్టాలనే దుర్బుద్ధి పుట్టినట్లుంది! పెద్ద ఇల్లు అంటోంది తెలివిగా! మనం కట్నం తీసుకోలేదు. ఆమె జీతం నెలా నెలా ఎలా వాడాలన్నది నిర్ణయించాల్సింది మనంగానీ, ఆవిడకాదు!” అన్నారిద్దరూ. ఆ మాటే రైటన్నారు ‘ఆడపిల్లలు!’ బామ్మగారు కూడా ఆయాసంగానే సమర్ధించింది!

“వాళ్ళని సలహా ఎందుకడగటం? మనిద్దరికీ వ్యక్తిత్వాలు లేవా? బాధ పడ్తున్నది మనిద్దరమేగానీ వాళ్ళు కాదుగా?” అంది యశోద కోపంగా ఆ రాత్రి భర్తతో.

“మనమే కొన్నాళ్ళు సర్దుకుందాం యశోదా! చెల్లాయిలిద్దరికీ పెళ్ళిళ్ళైపోతే ఇంత ఇరుకుండదు,”

యశోద పలకలేదు. అతి మొహమాటస్థుడైన భర్తకు ఇల్లాలు అయిన ప్రతి ఆడదీ ఇలాగే జీవితాంతం సర్దుకుపోక తప్పదని తెలుసుకుంది. రెండేళ్ళు తిరిగేసరికి ఒక అమ్మాయి పెళ్ళై అత్తారింటికెళ్ళింది కానీ ఇరుకు తగ్గలేదు. గోపాలరావుకో బాబు. ఆ ఇంట్లో కొత్తమెంబరుగా వెలిసి, వాడికో ఉయ్యాలతొట్టి, మరో బుల్లిమంచం. ఇంట్లోకి తెచ్చాడు.

గోపాలరావుకీమధ్య అపరిమితమైన చికాకు ఏర్పడింది! తండ్రి రిటైర్ అయ్యాడు. బామ్మ చనిపోయినందుకు “కర్మ” పేరుతో సంతోషించబోయేసరికి, తండ్రి పెరాలిసిస్‌స్ట్రోక్‌తో మంచంలో పడ్డాడు. చిన్న చెల్లాయికింకా పెళ్ళికాలేదు. తమ్ముడు ఇంటర్‌మీడియెట్‌తో కుస్తీకి సిద్ధపడ్డాడు. డిగ్రీ తెచ్చుకున్న చెల్లాయిని జాబ్‌లో చేరుస్తానంటే, తల్లి శోకాలు పెట్టింది. “దానికి పెళ్ళికావాలి! ఉద్యోగంలో వున్న అమ్మాయిని మనం కాబట్టి కోడలుగా తెచ్చుకున్నాం. అందరూ అలా ఒప్పుకుంటారా?” అంటూ... యశోదకూడా ఓర్పు సన్నగిల్లిపోతోంది.

“స్వార్థానికో హద్దుంది! జాలికో పరిధి వుంది. మీ వాళ్ళకి మనం సాయం చేయటం నాకూ సంతోషమే! కానీ, ఆ సాయం వాళ్ళందర్నీ ఇలా నిర్బాధ్యంగా మన మెడలమీదెక్కి సవారీచేసే రకాలుగా తయారుచేస్తేమాత్రం అది జాలి... స్వార్థత్యాగం అనిపించుకోదు. చేతగానితనం అవుతుంది. మీ చెల్లాయిని జాబ్‌లో చేరుద్దాం. తమ్ముడితో “నాయనా! ఏ టెక్నికల్ కోర్సో చదివి, నీ బ్రతుకుతెరువు నువ్వు చూసుకోక తప్పదు.” అని భయపెడదాం. అతగాడికి బాధ్యత గుర్తొస్తుంది. కాస్త కఠినంగా వుంటే అన్ని పరిస్థితులూ చక్కబడతాయి!” అంది.


అసలే చికాకుగావున్న గోపాలరావు యశోద సలహాకి మండిపడ్డాడు. “నిన్ను సలహా చెప్పమనలే!” అన్నాడు ఎగిరి పడ్తూ. ఆ సాయంత్రం టౌన్‌హాల్లో ఎవరో యోగిపుంగవుడు అద్భుతమైన వేదాంతోపన్యాసం ఇస్తున్నాడని తెలుసుకుని వెళ్లాడు గోపాలరావు. ఆ స్వామీజీ సంసారసాగరంలో ఎన్ని తిమింగలాలూ సొరచేపలా వున్నదీ అవి భార్యాబిడ్డల రూపంలో ఎలా మనిషినీ, మనసునీ, మోక్షాన్నీ నమిలిమ్రింగేదీ, చాలా చక్కగా వివరించాడు....

అంతే! ఆరాత్రి. గోపాలరావు అన్యమనస్కంగా ఇంటికి వచ్చాడు. అంటీముట్టనట్లు భోజనం చేశాడు. అందరూ నిద్రలో వుండగా....యశోద దిండుకింద – ఉద్యోగానికి తను రిజైన్

చేస్తూ ఆఫీసరుగారికో ఉత్తరమూ, తనకు సంసారంఅంటే విరక్తి కలిగిందనీ మోక్షమార్గం వెతుక్కుంటూ పోతున్నాననీ ఉత్తరమూ, వ్రాసిపెట్టి. అదృశ్యమైపోయాడు.

* * *

రోజులాలానే తెల్లారింది. కానీ ఎంత భారం ఆ ఇంట్లోకి మోసుకువచ్చాయో



సూర్యకిరణాలు! ఆ రెండుత్తరాలూ వీధివీధంతా తిరిగాయి!

"ఏదో గొడవజరిగే వుంటుంది భార్యాభర్తలమధ్య! లేకపోతే ఇంత తెగింపు రాదతగాడికి!" అన్నాయి కొన్ని నోళ్ళు.

"రెండేళ్ళుగా వేరు కాపురం పెట్టాలని పోరుపెడుతోంది! తలిదండ్రుల్ని వదులుకోలేక, భార్య పోరు పడలేక పాపం! గోపాలరావు సన్యాసుల్లో కలిసిపోయాడు!" అన్నారు ఇంట్లోవాళ్ళు.

"ఆఫీసులో ఎవరో ఉద్యోగితో తరచూ సన్నిహితంగా మెలుగుతోందట యశోద! గోపాలరావు అది పసికట్టాడు. మనసు విరిగి మాయమైపోయాడు! ఏంచేస్తాడు? ఉద్యోగంచేసే ఆడదాన్ని కంట్రోల్ చేయటం అంత తేలిగ్గాదోయ్! నాలాటి వాళ్ళకితప్ప!" అన్నాడో మహానుభావుడు గర్వంగా....

యశోద అన్నీ విన్నది! ఆమెకి వినిపించేటట్లుగా, వినిపించాలనే అన్నారంతా. ఏడాది కొడుకుని ఎత్తుకుంది! బోసినోటితో నవ్వులు కురిపిస్తున్న వాడి భవిష్యత్తుని భుజాలకెత్తుకుంది. నెలలోగా ఆ తాలూకానుంచి.... జిల్లానుంచి, రాష్ట్రంనుంచే ట్రాన్స్ఫరు చేయించుకు వచ్చేసింది. కొత్తరాష్ట్రంలో ఉద్యోగరీత్యా ఎన్ని జిల్లాలో తిరిగింది.

ఇరవై ఐదేళ్ళు... ఇరవై ఐదూ ఇంటూ పన్నెండు ఇంటూ ముప్ఫై ఇంటూ ఇరవైనాలుగు ఇంటూ అరవై... ఇంటూ అరవై ....ఏకంప్యూటర్లు తేల్చగలవా ప్రతి సెకను విలువా? జరిగిన ప్రతి సెకనూ ఆమెమీద ఎన్ని సంవత్సరాల వయసునీ .... కఠినత్వాన్ని రుద్దాయో ఎవరికి అంతుపడుతుంది శిలలా మారిన ఆమె హృదయానికితప్ప?

ఈ రోజు ఉదయం బాబు ఎం.ఏ. ఫస్ట్ క్లాసులో పాసైనట్లు రిజల్ట్స్ తెలిశాయి.

"అమ్మా! ఇంక మన బాధలు గట్టెక్కినట్లే. ఎలాగోలా రెండుమూడు నెలల్లో లెక్చరర్ పోస్టు నాకిప్పిస్తానన్నాడు నా ఫ్రెండు. వాళ్ళ నాన్నగారికి చాలా పలుకుబడి వుంది. ఏదో ఓ

ప్రైవేటు కాలేజీలో వేయిస్తానన్నాడు ముందు. ఆ తర్వాత గవర్నమెంటు జాబ్ కి ప్రయత్నం చేసుకోవచ్చు." అన్నాడు రాము సంతోషంగా. ఇరవై మూడేళ్ళ రాము ఆజానుబాహుడుగా పెరిగాడు! తండ్రికి ప్రతిబింబంగా వున్నాడు.

ఆమె నిట్టూర్చింది. ఈ రోజు వాళ్ళ నాన్నగారే దగ్గరుంటే? బహుశా పార్టీ ఇచ్చేవారేమో....క్షణకాలం ఓ తియ్యటి వూహ....అది భ్రాంతి అని తెలుసు....తల్లి మనసులోని ఆలోచన పసికట్టిన వాడిలా అన్నాడు రాము...

"నాన్నగారు లేరనేలోటు అనిపిస్తున్నట్లుంది నీకు...కదమ్మా? వుండివుంటే ఇంత పట్టుదలగా నా చదువు, నా అభివృద్ధి సాగేదికాదేమో? అడుగడుగునా, అందరి అభిప్రాయాలకూ విలువ ఇచ్చి, ముందు తండ్రి, ఆ తర్వాత తల్లి, ఆ చెల్లాయిపెళ్ళి, ఫెయిలుకావటమే ధ్యేయంగా పెట్టుకున్న తమ్ముడి చదువు....అలా చక్రంలో మనల్ని ఇరికించి, నా భవిష్యత్తుమాత్రం నాశనం చేసివుండేవారు 'త్యాగం' అనే చేతగానితనంతో. ఆయనలా ఆ రోజు వెళ్ళిపోవటమే మంచిదయింది. నువ్వా నరకంలోంచి బయటపడ్డావు. నన్ను పెంచావు. అమ్మా! నాకోసం అవమానాలు సహించావు. ఎన్ని శ్రమలో పడ్డావు. నీకు నేనున్నాను. మరో ఆలోచన వద్దు." అన్నాడు దృఢంగా.

నిజమే! తను వచ్చేశాక, తమ ఉనికి వాళ్ళకి తెలియకపోయినా! వాళ్ళ గురించి తనకు తెలుస్తూనేవుంది. ఆడబడుచు ఉద్యోగంలో చేరింది. మరిది ఓ మెకానిక్ షాపులో చేరాడు మెకానిక్ గా. ఆరేళ్ళలో ఆడబడుచు పెళ్ళిచేసుకుంది. మరది ప్రైవేటుగా పరీక్షలు పాసై, చిన్న మెకానిక్ షాపు స్వంతానికి పెట్టుకు పైకి వచ్చాడు. మామగారు చనిపోయారు. అత్తగారు మొన్నమొన్నటివరకూ కూతుళ్ళ దగ్గరా, కొడుకుదగ్గరా వుంటూ చనిపోయిందీమధ్యే! ఎవరూ ఏ వెత్తీ పడలేదు. నోటికి అందించే అన్న, వదినె దగ్గర లేకపోయేసరికి ఎవరి బాధ్యతలు వాళ్ళకి తెలిసివచ్చాయి. తమ మార్గం తాము చూసుకున్నారు. కానీ ఏ క్షణంలోనూ పెద్దకోడలు, ఆమె బిడ్డ ఎక్కడ వున్నారనిగానీ, వాళ్ళ పరిస్థితి ఏమిటనిగానీ! వాళ్ళకి ఏదైనా సాయం అవసరమౌతుందేమోననిగానీ ఆలోచించలేదెవరూ. మోక్షగామి అయి వెళ్ళిపోయిన గోపాలరావుకి... కుటుంబంలోగానీ, సమాజంలోగానీ, దోపిడీ చేయబడింది ఒక్క తన భార్యా, బిడ్డ మాత్రమేననే నగ్నసత్యం ఎలా, ఎప్పుడు బోధపడ్తుంది. రాము పిలిచాడు. త్రుళ్ళిపడింది.

"అమ్మా! అతిగా ఆలోచించకు. గతం మనకి లేదనుకుందాం. భవిష్యత్తు మన ముందుంది. దాన్ని జాగ్రత్తగా మలచుకోవటమే మన కర్తవ్యం. ఈ ఒక్కరోజు నా స్నేహితులతో సరదాగా గడుపుతాను. సినిమాకు వెళ్ళి రాత్రి ఎప్పుడో ఇంటికి వస్తాను. నాకోసం ఎదురుచూడక భోంచేసి పడుకో!" అన్నాడు రాము సాయంత్రం. ఆ చిన్న సరదా కాదనలేదామె. పెళ్ళినాటి ఫోటో వుంది తమిద్దరిదీ. బాబునెత్తుకుని తీయించుకున్నారోసారి ఇద్దరూ. ఈనాడు అద్దంలో చూసుకుంటున్నది తన ప్రతిబింబమేనా? ఏవీ ఆ విశాలమైన కళ్ళు? ఈ కళ్ళకింద జీవితపు అడుగడుగులో ఎదురొక్కన్న భయంకర నీలినీడలున్నాయి? ఏవీ ఆ బూరెబుగ్గలు? ఈ చప్పిడిదవడల్లో .... పల్లుబిగబట్టి ఓర్చుకున్న ఎన్ని అవమానాలు? అవహేళనలు? ఆ బారెడు జడ....జుట్టు ఏదీ? ఈ వేలుముడిలో, నెరసిన తలలో ఎన్ని తిరిగిరాని....ఇంకిపోయిన మధురస్మృతులు? ఈ బక్క శరీరం బ్రతుకుతోంది! ఏ లక్ష్యంకోసం? రాముకోసం....ఇక వాడికి ఉద్యోగం వచ్చి, పెళ్లైపోతే....తన కే బాధ్యతా వుండదు. ఈ జీవిత పోరాటంలో చాలా వరకూ విజయంసాధించినట్లే....రామును పంపి, తలుపు దగ్గరగా వేసుకు కూర్చొంది యశోద. దీపావళి రాబోతోంది! సరిగ్గా గోపాలరావు వెళ్ళి పాతికేళ్ళు నిండుతాయీ దీపావళికి! ఎక్కడున్నాడో? ఎలా వున్నాడో? ఇన్నేళ్లూ బాధ్యతబరువుతో ఆ ఆలోచన ఎక్కువగా రానివ్వలేదు ఈ రోజు, ఏదో రిలీఫ్ పొందగానే, భర్త అనబడే ఆ వ్యక్తి ఎలా వున్నాడో? ఎక్కడున్నాడో అని పదే పదే అనిపిస్తోందెందుకో!

తలుపుకొట్టిన చప్పుడుకు త్రుళ్ళిపడింది యశోద. గబుక్కున లైటువేసి తలుపుతీసింది....పెరిగిన గెడ్డం, మాసిన కాషాయ వస్త్రాలు....చేతిలో చిన్న సంచీ మెడలో రుద్రాక్షలతో అపరిచిత సాధువెవరో నిల్చుని వున్నాడు.

"ఎవరు? ఏం కావాలి?" తడబాటుగా అడిగింది.

ఆగంతకుడుకూడా అరనిముషంపాటు ఆమెకేసి పరిశీలనగా చూస్తూండిపోయాడు. "మీ పేరు యశోదగారేనా?" అనుమానంగా అడిగాడు.

"అవును, మీరెవరు? ఏంకావాలి?" అంది మళ్ళీ. సాధువులంటే చెడ్డ మంట ఏర్పడింది! బాధ్యతల్నుంచి పారిపోయే అవకాశవాదులు. పలాయనవాదులు....పరాన్నభుక్కులు! మోక్షం, వేదాంతం వగైరా ముసుగుల్ని కాషాయ అంగరఖాల్లాగా తొడుక్కునే మోసకారులు అనే అభిప్రాయం ఆమె అణువణువునా నిండిపోయిందీ పాతికేళ్ళలో.

"నా పేరు గోపాలరావు....యశోద

మీరే అయితే....ఒకనాడు మీ భర్తని నేను!" అతగాడు లోపలికి వచ్చేశాడు. షాక్ తిన్నట్లు చూచింది! ఆ గెడ్డం తీసేసి, పెరిగిన జుట్టు సరిగా కత్తిరించి, పీక్కుపోయిన ఆ కళ్ళలోకి పరిశీలనగా చూస్తే .... పాతికేళ్ళనాటి గోపాలరావు ఇతగాడేనా ? లేక ఎవరేనా తన కథంతా తెలిసి మోసంచేసేందుకు, వచ్చాడా ? మోసగించేందుకూ ? దోచుకునేందుకూ తనదగ్గరేమున్నాయిగనుక? నవ్వొచ్చింది యశోదకు. ఆ నవ్వుని మరోలా అర్థం చేసుకున్నాడతగాడు.

"హమ్మయ్య. గుర్తుపట్టావా యశోదా, గుర్తుపట్టవేమోనని భయపడ్డాను. నేను నేనేనని నిన్ను నమ్మించటంకోసం మనిద్దరి పెళ్ళిఫోటో, ఆ రాత్రి నావెంట నా బట్టలలో అనుకోకుండా వచ్చింది. జాగ్రత్తచేసి వుంచాను. ఇదుగో" రిలాక్సింగ్‌గా అక్కడేవున్న ఈజీచైర్‌లో కూర్చుంటూ అన్నాడు గోపాలరావు. అతగాడు కొత్త ఏమీ ఫీల్ గాకపోవటమే ఆశ్చర్యంగా వుంది యశోదకు. పాతికేళ్ళ గడిచిన కాలాన్ని అతి సునాయాసంగా 'గతం'గా నెట్టివేసిన ఈ వ్యక్తి మనస్తత్వం నాటికీ, నేటికీ ఒక్కలానే వుందనిపించింది.

ఎన్ని ఆశ్రమాలలో తిరిగాను యశోదా! అడవులు, కొండలు. ఒకటేమిటి? దేశమంతా తిరిగా నీ పాతికేళ్ళలో! ఎక్కడా 'శాంతి' లభ్యంకాలే దదేమిటో! ఆనాడు ఆసాధువుగారి బోధలోనైనా లోపం వుండి వుండాలి. లేదా నేను దాన్ని సరిగా అన్వయించుకోలేక పోయైనా వుండాలి. ఎక్కడ లోపం వుందో తెలీదు. నేను తిరిగి వచ్చేశాను. నేరుగా మనింటికి వెళ్ళాను. అక్కడెవరూ లేరు. విచారించి విచారించి .... అందరి వునికీ తెలుసుకోగలిగాను. నిన్నూ, బాబునీ గురించి చాలా కష్టంమీద అడ్రసు తెలుసుకోగలిగాను. అన్నట్లు, బాబెలా వున్నాడు ? బావున్నాడా ? బాగా పొడుగయ్యాడా ? నా పోలికలేనా ? నీలా వుంటాడా ? ఎం.ఏ. అటగదా ?"

యశోద విభ్రాంతిగా చూస్తుండిపోయింది! ఎంత సహజంగా అడుగుతున్నాడు ?

"ఓ! నువ్వు పలకటంలేదు. నామీద కోపంగావుంది....నాకు తెలుసు! నీకే గాదు. ఏ భార్యకయినా, ఇలా ప్రవర్తించిన భర్తమీద పీకలమొయ్యా కోపంవస్తుంది. క్షమించు. క్షమించమని మరీ మరీ అడుగుతున్నాను. గతం మర్చిపోదాం పీడకలలా! కొత్తజీవితం ప్రారంభిద్దాం. నాకు చాలా ఆకలిగా వుంది ప్లీజ్! ఏదైనా వుంటే పెట్టు!"

అల్లకల్లోలంగా వున్న మనసుని అదుపులో పెట్టుకుంది.

"కాసిని మజ్జిగ వున్నాయి తాగండి ముందు. ఓ గంటలోగా అన్నంవండి పెట్టేస్తాను!" అంది స్టౌ వెలిగిస్తూ. ఓవిధంగా అతగాడిముందు నిల్చోలేకుండా వుంది.

* * *

"యశోదా!" గోపాలరావు పిలుపుతో త్రుళ్ళిపడింది యశోద. గతం మాయమైంది. వర్తమానం ఎదుట నిల్చింది. అందులో తాను....గోపాలరావు. తన భర్త....వున్నారన్న నగ్నసత్యం బోధపడింది.

"వంటైందా ?"

"ఆఁ!" ఈజీచైర్ ముందుకు చిన్న స్టూలు లాగింది. రాము అలాగే భోంచేస్తాడు రోజూ. అదే డైనింగ్ టేబిల్! ఆకువేసి అన్నం, పప్పు, పచ్చడి వడ్డించింది.

"ఇదేమిటి ? మనిద్దరం తిందాం ?" నవ్వుతూ అన్నాడు.

"వద్దు. బాబు వచ్చాక, నేనూ, వాడు తింటాం!"

"పోనీ, నేనూ వుంటా నందాకా. ముగ్గురం తిందాం. మజ్జిగ తాగానుగా. ఆకలి యెక్కువగా లేదులే.."

"వద్దొద్దు.మీరు భోజనంచేసెయ్యండి. వాడిప్పుడప్పుడే రాడు. ఆకులో పెట్టేశాను గదా? తిరిగి తీసిపెట్టడం బావుండదు. చల్లారిపోతుంది."

అతగాడు అన్నం తిన్నంతసేపూ ఆమె మౌనంగా వుంది. వంటింట్లో ఏదో సర్దుతున్నట్లుగా వుండిపోయింది.

అన్నం తిన్నాక చెయ్యి కడుక్కుని వచ్చాడు. ఆమె ఆకు తీసేసింది.

"క్షమించినట్లేనా?" బాగా దగ్గరగా వచ్చి, ఆమె భుజంమీదుగా వంగి అన్నాడు. ఆమె తల తిప్పింది! ఆ కళ్ళలో భరించరానంత కంపరం....

"సారీ! గడ్డం బాగా గుచ్చుకుంటోంది కదూ? వద్దు. ఈవెధవ గడ్డం...కాషాయ వస్త్రాలూ తీసిపారేస్తాను. రేపు తెల్లవారగానే....నన్ను మమూలు మనిషిగా చూస్తావు...." నవ్వాడు.

"వద్దు!" శిల పగిలిన ధ్వని. బిత్తరపోయాడు.

"మీరిలాగే వుండిపోండి. నా కోసం గడ్డం తీయించుకో నవసరం లేదు. సన్యాసి బ్రతుకు వదలనక్కర్లేదు!"

"నీకింకా కోపంగా వుందా?"

"కోపమా ? కాదు కంపరంగా వుంది...."

"జాలి చూపమన్నానుగా!" జాలిగా చూస్తూ అడిగాడు.

"జాలి? జాలి విలువ ఎంత? పాతికేళ్ళ జీవనపోరాటమా? ఎందుకు చూపాలి జాలి! కన్నబిడ్డతో....కానని రాజ్యం వచ్చేటప్పుడు నా కెక్కడా ఆ 'జాలి' అనేది ఎదురవలేదు....భర్తని సన్యాసుల్లోకి తరిమినదానిగా ....భర్త చేత వదిలివేయబడ్డ స్త్రీగా అడుగడుగునా అవమానాలూ, అవహేళనలూ భరించవల్సి వచ్చిన క్షణాలలో ఎప్పుడూ 'జాలి' అనే మాట వుందని కూడా తోచలేదు నాకు! అందాకా ఎందుకు?

"నేను తనకి లొంగకపోతే నా

ఉద్యోగం వూడగొట్టిస్తాననీ....నా రాము భవిష్యత్తు నాశనమైపోయేలా వాణ్ణి ఫెయిల్ చేయిస్తాననీ. .ఓ ఆఫీసరు శపథం చేసి....నన్ను....నన్ను...." యశోద నిలువెల్లా కంపించిపోయి ఇక చెప్పలేక పోయింది.

"యశోదా!" చెవులు గట్టిగా మూసుకున్నాడు గోపాలరావు.

యశోద వెర్రిదానిలా నవ్వింది. "ఎన్నో రాత్రులు మీ కోసం .... మీ చల్లని స్పర్శకోసం పరితపించిపోయాను మీరు తిరిగి వస్తారని ఆశగా ఎదురు చూశాను .... తర్వాత రారని తెలిసి రాయైపోయాను. కానీ మీ స్పర్శ మర్చిపోయిన శరీరం రెండుమూడుమార్లు పరస్పర్శ .... విధిలేని పరిస్థితుల్లో భరించింది. సహించింది .... ఎవరి కోసం .... రాయైపోయిన నా హృదయంలో "రాగం"కోసం కాదు. నా రాము కోసం! వాడి భవిష్యత్తుకోసం. ఆ క్షణాలు భయంకరమైనవి. జుగుప్సాకరమైనవి. కానీ అలాటప్పుడు కూడా నాకు "జాలి" ఎదురవలేదు. నేను "జాలి" తలచబడలేదు. ఇప్పుడు చెప్పండి ఈ "జాలి" అనే మాటకు అర్థం వుందా?"

గోపాలరావు దిమ్మతిరిగినట్లు నిల్చుండిపోయాడు.

ఈ రోజు మీపట్ల నాకు జాలి కలగటం లేదు. కలగబోదు కూడాను. మీతోడు అవసరమనుకున్నన్ని రోజులూ అది నాకు లభ్యంకాలేదు. ఇప్పుడు నాకు ఎవరితోడూ అవసరం లేదు. జాలితో నన్ను నేను కించపరచుకోలేను. టైం తొమ్మిదిన్నర కావస్తోంది. వెళ్ళండి. మళ్ళీరాకండి. యుగయుగాల భారత నారీరక్తం పాతికేళ్ళలో సలసల మరిగి ఆవిరై పోయింది. కన్నీళ్ళు, కష్టాలూ ఆ రక్తంలోనే గడ్డకట్టుకు పోయాయి. "జాలి" ఆవిరిలో ఏ సుదూర తీరాలకో ఎగిరిపోయింది. ఇప్పుడు మీమీద జాలి పడి నేను మరో కొత్త సమస్యనెత్తి కెత్తుకోలేను!"

"కొత్త సమస్యా?"

"అవును! మీకినాడు ఉద్యోగంలేదు. ఇక రాదు! మీ పోషణభారం ఎవరు వహించాలి? ఉద్యోగం చేసినంతకాలం నేను, ఆ తర్వాత రాము! ఇది అదనపు సమస్య, బరువూ కాదా! భర్తగా మీరు పారిపోయి వదిలించుకున్న బాధ్యతని, భార్యగా, స్త్రీగా....నిర్వర్తించిన నాకు....పాతికేళ్ళ తర్వాత ప్రతిఫలంగా ఈ జరిమానా కూడా అవసరమా?

"ఒద్దు...మీరు వెళ్ళండి.మళ్ళీరాకండి! ఆమె వరండాలోకి వచ్చింది. గోపాలరావూ వచ్చాడు వెనకాలే.

గోపాలరావు రెండుమూడు నిముషాలు అలాగే నిల్చుండిపోయాడు.

"మరి ఇందాకట్నుంచీ ఈ మాట చెప్పక, అన్నం వండి, వడ్డించావెందుకు యశోదా? ఏమూలో నామీద నీకు ప్రేమ లేదా?" చివరిగా విస్పత్తువుగా అడిగాడు.

"ప్రేమ ఎందుకు లేదు? అణువణువునా వుంది! కానీ ప్రేమ, జాలి, సానుభూతి, సహకారం.. ఇవన్నీ పరస్పరం వున్నపుడే దాంపత్యం. ఏ ఒకటో అన్నీనో లోపించినపుడు వుట్టి ప్రేమ వుండీ ప్రయోజనం ఏమిటి? ఆకలిగొని వచ్చారు. మరో సాధువైతే పట్టెడన్నం అతగాడి జోలెలోవేసి పొమ్మనేదాన్ని! భర్తకాబట్టి...ఆప్యాయంగా వండి వడ్డించాను. నా పరిస్థితులు, నా గతమూ ఏదీ దాగకుండా చెప్పాను. ఇక ముందు మిమ్మల్ని భరించే శక్తీ, ఉత్సాహమూ నాలో లేవనికూడా చెబుతున్నాను. ఇక తర్కం వద్దు. వెళ్ళండి !"

"బాబు వచ్చేవరకూ...."

"ఒద్దు. బాబువస్తే మీరు అని తెలిస్తే వాడసలు సహించలేడు! తండ్రి లేని బిడ్డగా పెరిగాడు వాడు. తల్లిని ఎన్ని రకాలగానో ఎందరో అవహేళనగా మాట్లాడ్తుంటే వింటూ, కన్నీళ్ళు ఎండిపోయిన మగబిడ్డగా పెరిగాడు. ఈరోజు మీరు వాడి తండ్రినని గుర్తుచేసుకున్నా వాడు గుర్తించడు. గెంటేస్తాడు .... చెప్పానుగా? వాడు నా కొడుకుగా మీచేత నెట్టివేయబడి, నా ఒక్కర్తె కొడుకుగానే పెరిగాడు.."

"అంతేనా యశోదా!"

"అంతే!" ఆమె లోపలికి వెళ్ళి తక్కున తలుపువేసుకుంది....ఆ చీకట్లో కలిసిపోయాడు గోపాలరావు చేసేదిలేక.

పది నిముషాల తర్వాత రాము వచ్చాడు; యశోద తలుపు తీసింది.

"ఏమిటమ్మా అలా వున్నావు? ఏడ్చావా? కళ్లు ఉబ్బి వున్నాయెందుకు?" అన్నాడు ప్రేమగా తల్లి వేపు చూస్తూ.

"లేదులే..అన్నం తిందాం పద."

"ఆ వీధి చివర్లో ఓ సాధువు కనిపించాడు. మనింటికి వెళ్ళి వచ్చినట్లు చెప్పాడు. యశోదమ్మగారబ్బాయివి నువ్వేనా అని అడిగి మరీ ఆశీర్వదించి వెళ్లాడు!" నవ్వుతూ అన్నాడు రాము.

"అవును.. ఆకలిగా వుందన్నాడు. అన్నం పెట్టాను. జాలితలిస్తే కొన్ని రోజు లుంటానన్నాడు. జాలి తలచలేదు, వెళ్ళమన్నాను !"

రాము పకపక నవ్వాడు.

"మంచిపని చేశావమ్మా! పనీపాటా లేని ప్రతి సాధువుకీ జాలి కావాలి! ఛత్! పద అన్నం తిందాం."

ఆ రాత్రి రాము నిద్రపోయాక యశోద పడుకుంది. అందాకా .... ఇన్నేళ్లుగా ఆమె హృదయంలో వుండిన గోపాలరావు రూపం తక్కున చెరిగిపోయింది. నిశ్చింతగా నిద్రపోయిందామె.

———